

ఈతరం పిల్ల
(నవల)
కె. రామలక్ష్మి

# ఈ తరం పిల్ల

(నవల)

రచన

**కె. రామలక్ష్మి**

ప్రచురణ :

**స్త్రీ శక్తి ప్రచురణలు**

304, శ్రీ సాయి అపార్ట్‌మెంట్స్

ఓల్డు ఆర్.టి.ఎ. రోడ్, ఆస్మాన్‌ఘడ్

న్యూ మలక్‌పేట, హైదరాబాద్–500 036

ఫోన్ : 91–040–24162885

**ఈ తరం పిల్ల** (నవల)

© కె. రామలక్ష్మి

మొదటి ముద్రణ : 2014

వెల : **రూ. 125/-**

ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
గురుప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్)
హైదరాబాద్ - 500068.

ముఖచిత్రం :
**బాపు**

ముద్రణ :
**పల్లవి గ్రాఫిక్స్**
హైదరాబాద్ - 500 029

డి.టి.పి. : ఆర్. అనురాధా రఘురామ్ (09441186831), హైదరాబాద్-44.

## అంకితం

సంప్రదాయం – ఆధునికతల కలనేత
స్నేహం ఆప్యాయతల కలబోత
**కల్పకం ఏచూరి**
అరవై ఆరు వసంతాలు దాటిన
మన స్నేహానికి చిరుజోత
ఈ 'ఈ తరం పిల్ల'

కప్పూ, ఇది నీ కోసం

**కె. రామలక్ష్మి**
జయనామ ఉగాది

# ఈ తరం పిల్ల

"పంతులిగారి చిన్నమ్మాయి ఏదో గొడవ పడిందట" సాయంత్రం బీచి ఒడ్డున సిమెంటు సోఫామీద కూర్చున్న రిటైర్డు పెద్దలు – చర్చించుకోవడం మొదలుపెట్టారు. 'అదేదో పెద్ద గొడవేమో! లేకపోతే సాయంత్రం పంతులుగారు ఇక్కడ హాజరెందుకు కారు?' అన్నాడు అయ్యర్. అయ్యర్ రిటైరైపోయిన గుమస్తా. కూతుళ్లు ఉద్యోగాలకి వచ్చారు. పింఛను వస్తోంది. కొంప సొంతంది కాకపోయినా – ఖాళీ చేయించే రకం కాదు యజమాని. అద్దెలకోసం కట్టించిన గూళ్లు. అద్దె చెల్లిస్తున్నంతకాలం గొడవలేనిచోటు. 'నేను చాలాసార్లు చెప్పా, ఆడపిల్లని కాస్త కంట్రోల్‌గా పెంచాలని. కానీ ఆయన నిమ్మకు నీరెత్తినట్లు వూరుకుంటాడు. సార్‌కి విధవక్కగారుంది. ఆవిడగారి పేరేమో పిల్లది. అక్కగారంటే వల్లమాలిన అభిమానం సారుకి. ఎత్తి పెంచిందంటాడు. ఆవిడేం అన్నా బదులు చెప్పడు. పోనీ అని ఆవిడ యీపిల్లని అదమాయించదు! పేరింటికత్తె అని వల్లమాలిన అభిమానం. పాపం, యీ పిల్లది వాళ్లకి ఎప్పటికైనా సమస్య!' నిట్టూర్చాడు అయ్యర్.

"ఏంచేస్తాం సరే, ఇంటింటికీ మట్టిపొయ్యి" అన్నారు గుర్నాధంగారు. గుర్నాధం కాస్త పొట్టిగా పీలగా వుంటాడు గానీ చాలా లోతైన మనిషి అనిపిస్తాడు. ఆయనకీ కూతుళ్లున్నారు, బాగా చదువుకుంటున్నారు కూడా.

ఆయనకి వాళ్లమీద గొప్ప ఆశలున్నట్టు ఎప్పుడూ మాట్లాడడు. 'పంతులుగారు రిటైరై కూర్చున్నారన్న బెంగ ఆ కొంపలో ఎవరికీ వున్నట్టు కనిపించడంలే, పెద్దగా ఆయన పట్టించుకోడు. ఆ దేవుడికి తెలియాలి కొంప గుట్టుగా ఎలా గడుపుకొని వస్తూందో – వారి ఇల్లాలు' అన్నాడు కనబడని ఆ గృహిణి పట్ల గుర్నాథం జాలితో.

"ఊరుకోవయ్యా, భూమీ పుట్రా వుంది. ఏడాదికింత అని వచ్చి పడుతూనే వుంటుంది. అందులో తూ.గో.జీ.భూములంటే చెప్పాలా? ఓసారి పంతులుగారే చెప్పారు అప్పగారికి పొలంకూడా వుందనీ. ఆమె మరిదిగారు పల్లెలో దాన్ని చూసి లెక్కలు పంపుతూనే వుంటారనీ. పేరింటికత్తెకదా యీ కూతురు – దానికోసం ఆమె దాన్ని అమ్మనియ్యడం లేదనీ. 'ఆ, ఏమైంది? అమ్మేస్తే అంతే!' వాళ్ల వరసలోనే వుండే చెట్టిగారన్నారు. అతనికి ఆరోడ్డులోనే పచారీ కొట్టుంది. అందరికీ బియ్యం గట్రా అతనే వాడిక.

"చెట్టిగారూ, ఇంతకీ పంతులుగారి కూతురిలో ఏంటి గొడవ? మనం ఇరుగుపొరుగులంకదా కాస్త.... మాట సాయంగానే ఉండాలికదా! ఏమంటారూ?"

"నేను అడిగానండీ... ఆయన నవ్వేశారు. అది తెచ్చుకున్న గొడవ. అదే పరిష్కరించుకోవాలి చెట్టీ – మనకేం తెలుస్తుంది?' అన్నారు. ఏం చేస్తాం, ఇంక ఆయన చెప్తే వినాలి" పంతులుగారు బ్రాహ్మడేగానీ జంజం గట్రా వేసుకోడు. ఎప్పుడూ పూజా పునస్కారం చేయగా చూడలేదు. గుడీ గోపురాలకీ వెళ్లడు. ఓ కొడుకున్నాడంటారు. గత పదేళ్లుగా ఇక్కడే వున్నారా! ఆ కొడుకు రాకగాని పోకగాని – జాడలేదు. అదో మిస్టరీ అని వూరుకోవాలి. దాన్ని గురించి పంతులుగారే పట్టించుకోనప్పుడు – మనకేంటి? ఇరుగుపొరుగువాళ్లందరూ ఒక్కమాట చెప్పుకోవాలి. పంతులుగారు ఎప్పుడూ సహాయం చేయడానికి వెనుకాడరు. చెప్పాలంటే చాలామందికాయన తల్లో

నాలుకలాంటి వాడండీ.... అదిగో చూడండీ పంతులుగారు వస్తున్నారు” అంటూ దూరంలో కన్పించిన పంతులుగారిని చూపిస్తూ ఆగారు చెట్టిగారు.

ఒక్క పది నిముషాలు చుట్టూ పిల్లలగోల. వేరుశెనక్కాయలు, బఠాణీలు అమ్ముకునే పిల్లల కేకలు. గాలిలో నిండిపోయాయి. అదేమిటో – ఇంత గోల కేకల మధ్య కూడా సముద్రం ఘోష వినిపిస్తూనే వుంటుంది. ఆకాశంలో అక్కడక్కడ ఒకటీ అరా నక్షత్రం మిణుకుమిణుకుమంటూ మెరిసే ప్రయత్నం చేస్తూనే వుంటుంది. పూర్తిగా చీకటిపడిపోకపోయినా ఏదో చీకటి తెర తొలగడానికి సిద్ధంగా వున్నట్టు అన్పిస్తూ వుంటుంది. నీటి దగ్గరనుంచి నెమ్మది నెమ్మదిగా జనం లేవడం ప్రారంభిస్తారు. పిల్లల్ని చేతులు పట్టుకుని తల్లులు యీడ్చుకుంటూ రావడం ప్రారంభిస్తారు. అప్పుడే తెలుస్తుంది ఇక చీకటి వాలడానికి టైమవుతోందని.

పంతులుగారు వచ్చి బెంచీమీద తన స్థలంలో కూర్చుంటూ ‘ఇంకా మీరెవరూ కదలలేదా?’ అంటూ పలకరించారు. ‘అరె మీరు వస్తారో రారో అని ఇప్పుడే అనుకుంటూండగా మీరు దూరంలో వస్తూ కనిపించారు పంతులుగారూ – మళ్ళీ కూర్చుండిపోయాం. ఏమిటీ విశేషం? ఆలస్యమైందేం?’ కుతూహలంగా అడిగాడు గుర్నాథం.

పంతులుగారు కాస్త నవ్వారు! ‘ఏదో చిన్న పంచాయతీ’ అన్నారు.

‘అమ్మాయిదేనా?’ కాస్త నవ్వుతూ అడిగారు చెట్టిగారు.

‘ఇంకెవరున్నారండీ – పంచాయితీలు తెచ్చేవాళ్లు.’ నవ్వుతూ భుజంమీద వేసుకున్న కండువాతో భుజం తుడుచుకున్నారు. ఆయన కాస్త కూడా బాధపడ్డట్టు కనిపించలేదు. ఏమైనా చెప్పకపోతాడా? అని కుతూహలంతో ఎదురుచూడ్డం మొదలుపెట్టారు ఆయన మిత్రులు.

క్షణం ఆగి, వారి కుతూహలం మీద చన్నీళ్లు చల్లకూడదని చెప్పడం మొదలుపెట్టారు పంతులుగారు.

“ఏం లేదండీ, నిన్న అది స్నేహితులతో - సినిమాకి వెళ్లింది. ఎవరో కుర్రాళ్లు అల్లరి చేశారట. అందులో ఒకడు పెద్ద నాయకుడిని అనుకున్నాడో ఏమో. ఏదో వాగాడట ఇది ఊరుకోదుగా? ‘పోరా పోరికి’ అందిట. ‘అంతమాట అంటావా, నీ అంతు చూస్తా’ అన్నాడట. ‘నీలాంటివాళ్లని చాలామందిని చూశానురా పోరికీ, వెళ్లిరా’ అని. సినిమా వదిలాక బయటికి వచ్చి ఆటోకోసం చూస్తూందిట మిత్రులతో. రాత్రి ఎనిమిదైంది. వాళ్ల ఆటో దగ్గరికి వచ్చి ఎక్కడ దింపుతావో ఫోన్ చెయ్యి అంటూ ఓ కార్డు ఇచ్చాడట. ‘ఏడిశావు! ఫోనులో బూతులు మాట్లాడుతావు, వెధవ్వాగుడు వాగుతావు అంతేగా. టేప్ చేసి వుంచుతాలే రేపు మిత్రులతో పంచుకొందువుగాని’ అంటూ కోపంగా తెలుగు ఇంగ్లీషు అన్నీ కలిపి తిట్టి చక్కా వచ్చింది.... ‘అదీ విశేషం. ఆ కుర్రాడి నాన్న గవర్నమెంటు ఉద్యోగి. సెక్రటేరియట్‌లో ఉద్యోగం. ఏ మినిష్టరుగారి దగ్గిరో వున్నాడట. తైనాతీలు వుంటారు కదండీ. ఇద్దరు ఇంటికి వచ్చారు. ఏదో సమాధానం చెప్పి పంపించాను“ అన్నారు చాలా మామూలుగా.

చెట్టిగారు ఏదో అందామని నోరు తెరచి మళ్ళీ వూరుకున్నారు.

గుర్నాధమే ఉండబట్టలేక ‘అలా ప్రమాదం కొనితెచ్చుకోవడమేమిటి పంతులుగారూ, ఏడిపించడా? అల్లరి చేయడా? బొత్తిగా భయం లేకపోతే ఎలాగండీ బాబూ” అన్నాడు.

పంతులుగారు నవ్వి వూరుకున్నారు. ‘నిజంగా మీకు భయం వేయదా? మీ పిల్ల మీరు చెప్పినమాట వినదా? గట్టిగా కోప్పడండి పంతులుగారూ” మళ్ళీ అన్నాడు గుర్నాథం.

‘చూడు గుర్నాథం. మనం ఆడపిల్లల్ని చుట్టూ ముళ్లకంచె వేసి ఎన్నాళ్లు రక్షిస్తామయ్యా. రేపు నేను చచ్చిపోతే కట్టుకున్నవాడు ఇంకో కంచెవేసి కాపాడాలి. ఇక వాడుపోయాక - వాడి చుట్టాలూ పక్కాలూ. ఎన్నాళ్లని

వాళ్ళ బ్రతుకులిలా చేస్తాం చెప్పు? ఎన్నాళ్ళని ఎగరకుండా రెక్కలు కత్తిరించి ఎగరమంటాం చెప్పు. కన్నవాళ్ళం మనమే వాళ్ళకి బ్రతకడం నేర్పకపోతే – ఇంకా ఎవరైనా ఎందుకు నేర్పాలి?' అన్నారు. 'లేద్దాం సార్, చీకట్లు వాలిపోతున్నాయి" అంటూ చెట్టిగారు లేచారు. అయ్యర్ అంతకు ముందే లేచి లుంగీ సరిచేసి కట్టుకున్నారు. 'ఏం అయ్యర్ ఈరోజు మౌనంగా వుండిపోయారు? నా మాటలు నచ్చలేదా?' పంతులుగారు లేస్తూ అన్నారు – తేలికగా నవ్వేస్తూ.

'లేదు సార్, ఆలోచనలో పడ్డాను!' అన్నారు అయ్యర్‌గారు.

"ఏం లేదండీ – వారి ఆఫీసుకి అమ్మాయే వచ్చి మాట్లాడుతుందని చెప్పా. ఎవరిది తప్పయితే వారిచేత క్షమార్పణలు చెప్పించండి. ఈ గొడవెందుకు?' అని పంపా. వారికీ ఆ పరిష్కారసూత్రం బాగానే అనిపించింది కాబోలు – మినిష్టరు గారి ఛాంబర్ దగ్గరికి రమ్మన్నారు" అంటూ సరదాగా రాజకీయాలు మాట్లాడుతూ ఇంటిదారి పడ్డారు మిత్రులు.

దారిలో గట్టి వాదనలు ప్రారంభించడం వారెవరికీ యిష్టం వుండదు. ఆ వాదన ఇంటిదాకా వెడితే ఇక ఆగదు. భోజనాల టైమయేదాకా. రాత్రి న్యూస్ టైమ్ దాకా సాగుతుంది! అందుకే పంతులుగారు...ఒకటి గురించి కాకుండా అనేకం గురించి కబుర్లకి దిగుతారు!

ఎవరి కొంపలో వారు ప్రవేశించే టైముకి – సశేష వార్తలు వుండవు. హాయిగా భోజనం చేస్తారు. అయ్యర్‌గారు కాల్చిన అప్పడం, ఒరుగుల పులుసు! చెట్టిగారు పచ్చిపులుసు! ఇక గుర్నాథంగారే కాస్త వేపుడు కూరా, చారూ, మజ్జిగా తప్పనివ్వరు. అలా అలవాటు పడిపోయిన ప్రాణాలు.

'రేపు అమ్మాయి వెడుతుందంటారా!' అని గుర్నాథం భార్య అడిగానా...'వెళ్లినా వెడుతుంది. మొండి' అన్నాడు. చెట్టిగారి భార్య కాస్త

బెంగగా 'అలా చండీరాణిలాగా వుండే ఆ పిల్లకి పెళ్లెలా అవుతుందండీ' అని విచారపడుతూంటే, "పిచ్చిదానా, వాళ్లకి ఏదో ప్లాన్ వుండకుండా వుండదే' అని ధైర్యం చెప్తాడు చెట్టిగారు.

అయ్యరే కాస్త భయం ప్రకటించాడు. ఆయనకీ కూతుళ్లే! 'వాళ్లతో జాస్తి వెచ్చికాదే! మన పిల్లలలా తయారైతే, మనం ఈ పట్నం వదలి ఏ కుంభకోణమో పోయి సంబంధాలు చూసుకోవాలి. వాళ్ల పిల్లని మనం ఎన్నా కట్టడిలో వెక్క ముడియం?' అంటాడు. ఎందుకంటే... అతని పెద్దకూతురికి – పెళ్లి వయసు దాటిపోతోంది. సెక్రటేరియట్‌లో పనిచేస్తోంది. డిపార్ట్‌మెంట్ పరీక్షలు రాసేస్తోంది – రెండో పిల్ల బ్యాంక్ ఉద్యోగానికొచ్చింది! మిగతా వాళ్లిద్దరూ చదువుతున్నారు. రవి కానని చోటు ఒక కవి కానగలడన్నట్టు – ఇలాంటి కుటుంబ లుకలుకలు చెప్పకుండా తెలుస్తాయి! ఇంతకీ అందరికీ ఒకటే బాధ. రేపు పంతులుగారమ్మాయి వెడుతుందా? కొంపమీదికి ఏం గొడవ తెస్తుందో?...ఈ పంతులుగారు ఇక వీధిలో ముఖం చూపెట్టలేని పని ఈ పిల్ల చేస్తుందా? అప్పుడేమిటి గతి? ఇవన్నీ ఇరుగుపొరుగులని దొలిచేస్తున్న ప్రశ్నలు. పోనీ తమ ఆడాళ్లని ఆ పిల్లదాని తల్లితో మాట్లాడి తెలుసుకోమందామా అంటే భయం! ఆ అమాయకురాలు ఏడిస్తే ఏం చెయ్యాలి? ఇలా పంతులుగారి అమ్మాయి ఎంతమంది నిద్రనో పాడుచేస్తోంది!

ఇందర్ని ఇబ్బంది పెడుతున్న పంతులుగారు అనుకోవడం లేదు. వారి అమ్మాయి అసలే అనుకోవడం లేదు. కారణం ఏం లేదు. ఈ విషయం గురించి వాళ్ళింట్లో తగాదాలు వున్నట్టు లేదు! గట్టిగా మాటా మాటా అనుకోవడం కూడా ఎవరూ వినలేదు. అమ్మాయి చదువు అయిపోయింది. అలా అని వుట్టినే కూర్చోలేదు. ఎక్కడికో వుద్యోగానికి వెడుతూంది. వస్తోంది. ఆ ప్రయాణంలోనే ఆమె గారు అన్నివిధాల లావాదేవీలు తెస్తోంది. అది అందరికీ తెలుసు. 'ఎన్నమ్మా!' అని ఏ రిక్షావాడైనా అడిగితే – 'ఒన్ను ఇల్లే

కాళీ, వరప్పో డాష్ కుడుతా. నా ఒళ్లు మండి, మూంజి మేల కుడితే. ఎవరేనా చూస్తారన్న భయంతో పక్కసందులోకి పోయాడు' అని నవ్వుతూ ఇంట్లోకి చక్కాపోయింది. అలాంటి దాన్నేం చెయ్యగలం? కాళీగాడే – 'సరిదా చేసింది అనుకుంటే!'

అన్నట్టు చెప్పలేదు కదూ. పంతులుగారి అమ్మాయిపేరు ముద్దులక్ష్మి. అసలు గొడవంతా ఆ పేరులోనే వుంది. పంతులుగారి అత్తగారి పేరు ముద్దులక్ష్మి. పంతులుగారి అప్పగారి పేరు పెద్దలక్ష్మమ్మ. పెద్ద లక్ష్మమ్మగారు పంతులుగారి అత్తగారికి స్వయానా ఒదినగారవుతుంది...అందుచేత ఆడపిల్ల పుట్టగానే – లక్ష్మమ్మ పేరూ, ముద్దులక్ష్మి పేరూ కలిసి ముద్దులక్ష్మి! పేరూ కలిసి ముద్దులక్ష్మి కొంచెం మొద్దు. రంగూ తక్కువే. తెలివీ తక్కువే. అని తాతగారింటా, స్వంత ఇంటా కూడా తెగ ముద్దుచేసి – బాగా ఆరేళ్లు దాటిపోయేదాకా అక్షరం ముక్క దిద్దలేదు. భుజాలు దిగని జుట్టు. కళ అయిన ముఖం బాగానే వుందిగాని – రంగు పెరగదు కదా. అందుకే తెలిసినవాళ్లు, తెలియని వాళ్లు 'ముద్దూ ఎంత మొద్దువే! ముద్దొస్తున్నావు' అని ముచ్చటపడిపోయేవారు! ఇది పొగడ్తకాదని తెలుసు. అందుకే పంతులుగారికి కాస్త కోపం వచ్చేది. కాని ఆయన అప్పగారికి బహు పసందుగా వుండి, చెవుల అమృతం కురిసినంత ఆనందపడిపోయేది. 'నా వారసురాలు. దానికి చదువు వచ్చినా రాకున్నా ఫరవాలేదు. దాన్ని ఎవడేనా కట్టుకుపోతాడు' అని తమ్ముడిని కోప్పడేది. మొత్తానికి అందరూ ముద్దుచేసి ముద్దులక్ష్మిని కాస్తా మొద్దులక్ష్మిని చేశారు! పంతులుగారి భార్యకి కూడా ఆ పేరు ఇష్టం లేదు. తన తల్లి పేరు కలిపినందుకు ఆనందంగా వున్నా – తన విధవాడబడుచు పేరు కలపడం అంత రుచించడం లేదు. కాని నోరులేని ఆ ఇల్లాలి మాట ఏం చెల్లుతుంది? ఆమెకి తన తల్లిపేరు పెట్టినా – ఆవిడ నగానట్రా అన్నదమ్ములు దక్కనిస్తారా? తమ కొడుకులకెవరేనా

చేసుకుంటారా? అని ఆవిడ అనుమానం. ఆ కొంపలో మగకుర్రాళ్ళంతా – తెలివికి లోటులేనివాళ్ళే. ఊళ్లో తెలిసినవాళ్ల పిల్లలు – చుట్టాల పిల్లలు అందంగా వుంటారు. చదువుకుంటున్నారు. తన కూతురొక్కర్తే – అందరూ అన్నట్టే మొద్దులా తయారైందని లోలోపల తెగ బాధపడిపోతూ వుంటుంది. ఎప్పుడేనా మొగుడితో తన బాధ చెప్పుకుంటే – 'నీ మొఖం' 'దానికేం లోటనీ?' చూస్తూ వుండు. వయస్సు వచ్చిందంటే – ఎలా వెల్లివిరుస్తుందో! గొంగళీ పురుగు సీతాకోకచిలక అవడం చూడలేదా? పిచ్చిదానా, పైకి అనకు. అప్ప చాలా బాధపడుతుంది' అంటాడేగాని దానికి ఓ మేష్టరి నమర్చేనా ముందు అక్షరాలు నేర్పించి స్కూల్లో పడేస్తే బాగుండును' అనుకుంటుందేగాని ఎవరికీ గట్టిగా చెప్పలేదు. ఏదో వంకన ముక్కు ఎగబీలుస్తూ వుంటుంది. అది చూసి పంతులుగారికి చికాకు. అది చూసి ఇరుగు పొరుగులు – 'పాపం ఇల్లాలిని సాధించిపోస్తారు లావుం'దని చెవులు కోరుక్కోవడం.

ఇలా పంతులుగారి అమ్మాయి – ఏదో రకంగా వాళ్ళింట్లో సమస్యగానే పెరిగి పెద్దదవుతోంది అనుకునేలోపలే. స్కూల్లో వేయడం, చదువుకోవడం, కొంపమీదకి జట్టీలు తేవడం ప్రారంభించింది ముద్దులక్ష్మి.

'అందరూ నన్ను వెక్కిరిస్తున్నారు – ముద్దూ' అంటూ. పేరు మార్చు నాన్నా! అని గోల చేయడం ప్రారంభించింది – పదో క్లాసుకి వచ్చేసరికి. కాస్త వయస్సు రావడం, స్కూల్లో – ఆడపిల్లలు, మగపిల్లలు అవడం. ముద్దులక్ష్మికి మరీ ఇబ్బందిగా తయారైంది. దానికి సాయం చదువుతోపాటు ఆటలు కూడా బాగా ఆడడంతో ఆమె పేరు మారుమోగడంగా తయారైంది. స్కూలు ఫైనలప్పుడు ఆడపిల్లల త్రోబాల్ టీమ్‌కి కేప్టన్ అయి ఇంటర్ స్కూలు ఆటల పోటీలో – పేరు ఢంకా బజాయించి మరీ మ్రోగింది. గేమప్పుడు 'కమాన్ ముద్దూ' కేకలతో ప్లేగ్రౌండ్ మారుమ్రోగించింది. ఇంకెప్పుడూ పేరు మార్చుకోవాలని అనిపించడం కూడా లేదు ముద్దులక్ష్మికి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Ee+Taram+Pilla](http://kinige.com/book/Ee+Taram+Pilla)**

* * *